సుదీర్ఘ కల.. ఫలిస్తున్న వేళ


మట్టి రోడ్డుగా అయిపోయిన గ్రావెల్ రోడ్డు

- రూ.4.60 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు
- తాళ్లూరు– కావలి మధ్య తగ్గనున్న 16 కి.మీ. దూరం
- రెండు మండలాలు. పలు గ్రామాలను కలుపుతూ రోడ్డు నిర్మాణం

కావలి: రహదారులు అభివృద్ధికి చిహ్నాలు. రాష్ట్ర ప్రభుత్వం గడిచిన ఏడాదిన్నర కాలంలో పాత రోడ్ల అభివృద్ధితో పాటు కొత్త రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతూ వస్తోంది. తాజాగా కావలి నియోజకవర్గంలోని కావలి నుంచి బోగోలు మండలంతో పాటు ఉదయగిరి నియోజకవర్గంలోని జలదంకి మండలానికి చెందిన కనీసం పది గ్రామాలను కలుపుతూ వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణానికి నడుంబిగించింది. రూ.4.60 కోట్ల వ్యయంతో సుమారు 7 కి.మీ. మట్టి రోడ్డు స్థానంలో బీటీ రోడ్డు నిర్మించేందుకు అన్ని చర్యలు చేపట్టింది. దూరాన్ని తగ్గిస్తూ ప్రజలకు ఎంతో ఉపయోగపడే అనువుగా ఉండే రోడ్డును నిర్మించడానికి రంగం సిద్ధమైంది. కావలి నియోజకవర్గంలోని బోగోలు మండలం తాళ్లూరు గ్రామం నుంచి పాత బిట్రగుంట మీదుగా కావలి రూరల్ మండలం గౌరవరం వరకు 7 కిలో మీటర్లు మట్టి బండ్ల బాట ఉంది. గ్రావెల్ రోడ్డుగా ఉండడంతో రాకపోకలకు పలు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. చినుకు పడితే చిత్తడిగా మారే ఈ రోడ్డులో రాకపోకలు సాగించడం అతికష్టంగా మారింది. తాళ్లూరు సమీపంలో ఉన్న ఉదయగిరి నియోజకవర్గంలోని చామదల, బ్రాహ్మణక్రాక పంచాయతీల్లోని గ్రామాలకు చెందిన వారితో పాటు తాళ్లూరు ప్రజలు కావలికి చేరుకోవాలంటే 31 కిలో మీటర్లు ప్రయాణం చేయాలి. అదే తాళ్లూరు–గౌరవరం మధ్య మార్గాన్ని అభివృద్ధి చేస్తే కావలి పట్టణానికి కేవలం 15 కిలో మీటర్లు మాత్రమే ప్రయాణం చేస్తే సరిపోతోంది. అంటే సగం కిలోమీటర్ల ప్రయాణం తగ్గిపోతోంది.

రూ.4.60 కోట్లతో 7 కి.మీ. రోడ్డు

ప్రభుత్వం కూడా ఈ రోడ్డును అత్యంత ప్రాధాన్యత కలిగిన రోడ్డుగా నిర్ధారించి 'ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన' (పీఎంజీఎస్‌వై) పథకంలో మంజూరు చేసేందుకు శాఖాపరమైన చర్యలు వెను వెంటనే తీసుంది. తాళ్లూరు నుంచి గౌరవరం వద్ద జాతీయ రహదారి వరకు 7 కి.మీ. రహదారిని బీటీ రోడ్డుగా మార్చేందుకు రూ.4.60 కోట్ల అంచనాలు రూపొందించారు. ఏప్రిల్ తర్వాత కొత్త ఆర్థిక సంవత్సరంలో మంజూరయ్యే రోడ్ల జాబితాలో ఈ రోడ్డుకు నిధులు కేటాయింపు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

గ్రామాల ప్రగతి వికాసానికి అభివృద్ధి చేసిన రోడ్లను ప్రామాణికంగా చూపుతారు. గౌరవరం– తాళ్లూరు మధ్య రహదారి కల గడిచిన దశాబ్దాలుగా కాలి బాట.. బండ్ల బాటగానే మిగిలిపోయింది. గత ప్రభుత్వం రోడ్లు వేశామని గొప్పగా చెప్పుకున్నా.. కేవలం ఏడు కి.మీ. రహదారిని పట్టించుకోలేదు. కావలి నియోజకవర్గంలో టీడీపీ హయాంలో కొత్త రోడ్ల అభివృద్ధి సంగతి దేవుడు ఎరుగు.. పాత రోడ్లపై కనీసం తట్టడు మట్టి వేయలేదు. డబ్బా తారు పోయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆర్థికంగా ఎన్నో సంక్షోభాలు ఎదురైనా.. ఓ వైపు ప్రగతి.. మరో వైపు సంక్షేమం జోడెద్దుల ప్రయాణంలా సాగిస్తోంది. తాజాగా కావలి– తాళ్లూరు మధ్య రహదారి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఎమ్మెల్యే చొరవతో..

కావలి రూరల్ మండలం గౌరవరం, బోగోలు మండలంలోని పాత బిట్రగుంట, కొండబిట్రగుంట, తాళ్లూరు ప్రాంతాలకు చెందిన రైతులకు కూడా రాకపోకలు సాగించడానికి ఈ రోడ్డు సౌకర్య వంతంగా ఉంటుంది. ఈ మార్గాన్ని తారు రోడ్డుగా అభివృద్ధి చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు చాలా కాలం నుంచి కోరుతున్నారు. అయితే వారి కల ఇంత కాలం వరకు కూడా కలగానే ఉండిపోయింది. ముఖ్యంగా బోగోలు మండల ప్రజలు స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ఈ రోడ్డు గురించి పలుమార్లు చెప్పడంతో దాని ప్రాధాన్యతను గుర్తించిన ఎమ్మెల్యే భవిష్యత్‌లో మంచి తారు రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే సూచనలు మేరకు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు ఈ రోడ్డు నిర్మాణంపై అధ్యయనం చేసి రోడ్డు అవశ్యకత, అంచనాలతో కూడిన నివేదికను సిద్ధం చేశారు. ఈ నివేదికను ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయడంతో ప్రభుత్వం నుంచి ఆమోదం లభించింది.

రాకపోకలు దగ్గరవుతాయి



తాళ్లూరు–గౌరవరం రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేయాలనేది మా ప్రాంతంలోని ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుకుంటున్నారు. గ్రామానికి వచ్చే ప్రజా ప్రతినిధులకు, అధికారులకు అర్జీలు ఇచ్చి కోరేవారం. కానీ రోడ్డు పనుల గురించి అధికారులను అడిగితే ఇప్పట్లో జరగదని చెప్పేవారు. అయితే ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ఈ రోడ్డు ఆవశ్యకతను చెప్పడంతో, కచ్చితంగా రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేస్తానని మాట ఇచ్చారు. ఆ మాట త్వరలో నిజం కాబోతోంది. తారుగా అభివృద్ధి చేయడానికి లాంఛనాలన్నీ పూర్తయ్యాయని స్వయంగా అధికారులే తెలియజేశారు. మా ప్రాంత గ్రామాల ప్రజలు కావలికి రాకపోకలు సాగించడానికి ఈ తారు రోడ్డు నిర్మాణంతో దూరం తగ్గుతుంది.

– సుంకే మాల్యాద్రినాయుడు, తాళ్లూరు, బోగోలు మండలం

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ


ఆత్మకూరు ఎల్‌ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: జిల్లా విజిలెన్స్, మానటరింగ్ కమిటీ సభ్యులు శేషం సుదర్శన్ ఆధ్వర్యంలో ఆత్మకూరులోని ఎల్‌ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం తనిఖీ నిర్వహించారు. సెక్టార్–2లో నడుస్తున్న ఈ కేంద్రంలో స్టాక్ రిజిస్టర్, చిన్నారులకు వండి పెడుతున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం లక్షలాది రూపాయలు అంగన్‌వాడీలకు కేటాయిస్తూ చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, ఎదుగుదలకు కృషి చేస్తోందని, ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా అంగన్‌వాడీల నిర్వాహకులు విధులు నిర్వహించాలని కమిటీ సభ్యులు కోరారు. గర్భిణులకు కేంద్రంలోనే పౌష్టికాహారం అందజేయాలన్నారు. కమిటీ సభ్యులు ఖాజారసూల్ తదితరులు ఉన్నారు.

రైతులకు సహకరించాలి


వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్‌ఆర్‌ఐ వెంకటరమణారెడ్డి

కలిగిరి: ఆరుగాలం కష్టపడి పొగాకు సాగుచేసిన రైతులకు మంచి ధరలు లభించేలా పొగాకు బోర్డు అధికారులు, కంపెనీల ప్రతినిధులు సహకరించాలని ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ మూల వెంకటరమణారెడ్డి కోరారు. కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. పొగాకు బోర్డు రైతులు, అధికారులు, కంపెనీల ప్రతినిధులతో పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్‌తో పొగాకు రైతుల సమస్యలు, వేలం నిర్వహణపై పలు విషయాలు చర్చించారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలి


పాదయాత్ర నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మర్రిపాడు: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పందిటి అంబేడ్కర్, నందిపోగు వెంగళరావు, గోచిపాతల వెంకటేశ్వర్లు, బొద్దుకూరు మహేష్ డిమాండ్ చేశారు. 2014 ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడుతామని చెప్పినప్పటికీ 9 ఏళ్లు గడిచినా పట్టించుకోలేదన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం తాము మర్రిపాడు నుంచి పాదయాత్ర మొదలుపెట్టి అన్ని గ్రామాల్లో పర్యటిస్తూ ఎస్సీలందరిని చైతన్యం చేస్తూ ఏప్రిల్ 3వ తేదీన నెల్లూరులో బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సోంపల్లి హజరత్తయ్య, గొల్లపల్లి శ్రీనివాస్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువులకు మెరుగైన వైద్యం


దూడకు వైద్యసేవలు అందిస్తున్న పశువైద్యసిబ్బంది

మర్రిపాడు: పశువులకు ఇంటి వద్దనే మెరుగైన వైద్యం అందిస్తామని పశుసంవర్ధకశాఖ అధికారి ఎస్‌కే ముజిముల్ తెలిపారు. మండలంలోని పడమటినాయుడుపల్లిలో పడచల హజరత్తయ్య అనే రైతుకు చెందిన దూడ తీవ్ర అనారోగ్య స్థితిలో ఉండడంతో వెంటనే 1962కు నంబరుకు కాల్ చేశారు. వెంటనే మర్రిపాడులో ఉన్న వైఎస్సార్ పశు సంచార ఆరోగ్య సేవా రథం సిబ్బందికి సమాచారం అందించడంతో వారు గ్రామానికి చేరుకుని దూడకు మెరుగైన వైద్యం అందించారన్నారు.

దూషించడంపై కేసు నమోదు

ఆత్మకూరు: తనను అకారణంగా దూషించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని పట్టణంలోని జేఆర్‌పేటకు చెందిన షమీమ్ అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై సాయిప్రసాద్ సమాచారం మేరకు.. జేఆర్‌పేటకు చెందిన షమీమ్‌ను ఆమె ఇంటి పక్కనే నివశిస్తున్న బంధువులు షంషాద్, ఇమ్రాన్, షాహీద్ తన ఇంటికి వచ్చి దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గోమాత మాతృత్వం


ఆవు వద్ద పాలు తాగుతున్న మేకపిల్ల

ఉదయగిరి: ఓ గోమాత ఆకలితో ఉన్న మేకపిల్లకు పాలిచ్చి మాతృత్వాన్ని చాటుకుంది. ఈ ఉదంతం ఉదయగిరిలోని యాదవపాళెంలో బుధవారం ప్రచార మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. జాతి వివక్ష పక్కన పెట్టి ఆకలితో ఉన్న మేక పిల్లకు ఒక గోవు పాలివ్వడం చర్చనీయాంశంగా మారింది.

ఘనంగా కాన్షీరామ్ 89వ జయంతి


కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత కాన్షీరామ్ 89వ జయంతిని బీఎస్పీ నాయకుడు నందా ఓబులేసు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లిలో ఉన్న బీఎస్పీ కార్యాలయంలో కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బహుజనులను ఏకతాటిపై నిలిపి ఉత్తరప్రదేశ్‌లో సంచలన రాజకీయాలకు నాంది పలికిన కాన్షీరామ్‌ను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ


ఫ్లోరోసిస్ బాధితులకు వాకర్స్ అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య


మర్రిపాడు: రికార్డులు పరిశీలస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

సీతారామపురం: సీతారామపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ దివ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులు, కాన్పుల గది, ల్యాబ్‌ను పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో కాన్పుల శాతం పెంచాలన్నారు. ల్యాబ్‌లో అన్ని పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఫ్లోరోసిస్ బాధితులతో సమావేశం నిర్వహించి, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్న నలుగురికి వాకర్స్ అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వప్న, సీహెచ్‌ఓ మంజుల, ఎంపీహెచ్‌ఈఓ అబ్దుల్, మజీద్, ఫార్మాసిస్ట్ కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మర్రిపాడు: మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారి పెంచలయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులన్నింటిని పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. రికార్డుల పనితీరు బాగుందన్నారు. అనంతరం చిలకపాడు ఆరోగ్య ఉపకేంద్రాన్ని కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పొలానికి పనికి వెళ్లేవారు ఉదయం 11 గంటల కల్లా పూర్తి చేసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాతనే బయటకు రావాలని, అప్పటి వరకు ఇళ్లలో ఉండాలన్నారు. వేసవి కాలంలో అధికంగా నీరు, మజ్జిగ, టెంకాయ నీళ్లు తాగాలని సూచించారు. వైద్యసిబ్బంది కూడా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఫ్లోరోసిస్ డాక్టర్ సీహెచ్ దివ్య, మర్రిపాడు వైద్యాధికారి గోపీనాథ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కోలాహలం.. పాఠశాల వార్షికోత్సవం


దేశ నాయకుల వేషధారణలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు మండల పరిషత్ ఆదర్శ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఉత్సాహభరిత వాతావరణంలో కోలాహలంగా జరిగాయి. పాఠశాల హెచ్ఎం షేక్ ఇస్మాయిల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్‌లో చేసిన ఉపన్యాసాలు, సంభాషణలు వారి తల్లిదండ్రులను సభకు హాజరైన వారిని పరమానందభరితులను చేశాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు వేర్వేరుగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. దేశ నాయకుల వేషధారణలో విద్యార్థుల ఏకపాత్రాభినయాలు సభికులను మంత్ర ముగ్ధులను చేశాయి. వైఎస్సార్‌సీపీ మండలకన్వీనర్ చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఉద్దాల పెంచలరావు, మహిమలూరు సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, మహిమలూరు ఎంపీపీఎస్, హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్లు హరిష్, నాగేశ్వరరావు ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వాశిలి పశువైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి, మర్రిపాడు మాజీ ఎంఈఓ సత్యనారాయణ, ఉపాధ్యాయులు రమేష్, రఫీ, రవికుమార్, దయాకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల ఫోరంపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫోరం సభ్యులు

వరికుంటపాడు: ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఏపీ కన్జుమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వినియోగదారుల ఫోరంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కన్జుమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చల్లగాలి వెంకటమోహన్ మాట్లాడుతూ దుకాణంలో ఒక వస్తువు కొనుగోలు చేసినప్పుడు ఆ వస్తువు తయారీ, గడువు తేదీని చూసుకోవాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ వినియోగదారుల ఫోరంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వరికుంటపాడు మండల ప్రొటెక్షన్ ఫోరం ఉపాధ్యక్షుడు డి.మహేష్, సభ్యుడు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులను పరిరక్షించాలి

కావలి రూరల్: ప్రస్తుత సమాజంలో వినియోగదారుల రక్షణ చట్టంపై ప్రజలు అవగాహన పెంచుకుని వినియోగదారుల హక్కులను పరిరక్షించుకోవాలని సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి అన్నారు. పట్టణంలోని పాతవూరు మున్సిపల్ పాఠశాలలో బుధవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మధుసూదన్, ఉపాధ్యాయిని దయలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్


పట్టుబడిన పేకాట రాయుళ్లతో ఎస్సై జంపాని కుమార్

వింజమూరు: మండలంలోని కాటేపల్లి–రావిపాడు మధ్య అటవీ ప్రాంతంలో ఐదుగురు పేకాటరాయుళ్లను బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై జంపానికుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం రావడంతో తమ సిబ్బందితో అటవీ ప్రాంతంలో తనిఖీ చేయగా పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.8,460 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని కోర్టుకు హాజరుపరుస్తామన్నారు.

స్వర్ణదీపం ట్రస్ట్‌కు విరాళం


స్వర్ణదీపం ట్రస్ట్‌కు విరాళం అందజేస్తున్న విద్యార్థులు

చేజర్ల: నెల్లూరుకు చెందిన స్వర్ణదీపం ట్రస్ట్‌కు మండల కేంద్రం చేజర్లలోని లుంబిని విద్యాలయం విద్యార్థులు రూ.30 వేలు విరాళం అందజేశారు. బుధవారం పాఠశాల ఆవరణలో ఆ ట్రస్ట్ సభ్యులు ఎస్‌కే రఫీకి డబ్బులు ఇచ్చారు. ఆ సేవా సంస్థలో వృద్ధులకు, దివ్యాంగుల అవసరాల కోసం ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఏసీ మరమ్మతులకు ఉచిత శిక్షణ

దుత్తలూరు: దుత్తలూరులోని సీడ్స్ సంస్థలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఏసీ మరమ్మతులకు ఉచిత శిక్షణ ఇచ్చి మెళకువలు నేర్పించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి వేణుగోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దూరప్రాంతం నుంచి వచ్చే వారికి ఐదు రోజుల పాటు ఉచిత వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన ఏసీ మెకానిక్, అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న టెక్నీషియన్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9908217465 నంబరులో సంప్రదించాలన్నారు.

దర్గా గోడ ధ్వంసం

- పోలీసులకు ఫిర్యాదు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని పవిత్ర పుణ్యక్షేత్రం హజరత్ నాయబ్‌రసూల్ దర్గా గోడను రాజారమణయ్య అనే వ్యక్తి ధ్వంసం చేసినట్లు వక్ఫ్‌బోర్డు అధికారులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్గా సిబ్బంది సమాచారం మేరకు ఎన్నో ఏళ్లుగా అమ్మాజాన్ మహల్ వద్దనున్న దర్గా గెస్ట్‌హౌస్ ముందున్న ప్రహరీని రాజా రమణయ్య అనే వ్యక్తి ధ్వంసం చేయడంతో వక్ఫ్‌బోర్డు అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై ఆ వ్యక్తిని విచారించగా గోడ తమదేనంటూ దర్గాకు ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. వక్ఫ్‌బోర్డు అధికారులు వచ్చి చూసేంత వరకు గోడను ధ్వంసం చేయరాదని ఎస్సై నరేష్ ఆయనకు సూచించారు.

ట్రాక్టర్, ఆటో ఢీ

- త్రుటిలో తప్పిన ప్రాణాపాయం


నుజ్జునుజ్జయిన ఆటో

అల్లూరు: ఎదురెదురుగా ట్రాక్టర్, ఆటో ఢీకొని ఆటో బోల్తాపడిన ఘటన స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట బుధవారం రాత్రి జరిగింది. అయితే త్రుటిలో ఆటో డ్రైవర్‌కు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. స్థానికుల సమాచారం మేరకు.. అల్లూరు నుంచి నెల్లూరు వైపు ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను నెల్లూరు నుంచి అల్లూరుకు వస్తున్న ఆటో ఢీకొని బోల్తా పడింది. ఆటోలో డ్రైవర్ ఒక్కడే ఉండడంతో అతడు స్వల్పగాయాలతో తప్పించుకున్నాడు. ఆటోడ్రైవర్ మద్యంతాగి నిర్లక్ష్యంగా నడపడంతో ఈ ప్రమాదం జరిగిందని తెలిసింది. ప్రమాదంలో ఆటో అయితే నుజ్జునుజ్జు అయింది.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం


ఆత్మకూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రానికి చేరుకుంటున్న విద్యార్థులు


వింజమూరు: పరీక్ష కేంద్రంలో తమ నంబరు చూసుకుంటున్న విద్యార్థులు


ఉదయగిరి: పరీక్ష కేంద్రం వద్ద పర్యవేక్షిస్తున్న సీఐ, ఎస్సై

ఆత్మకూరు: విద్యార్థి దశకు కీలకమైన ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం (జనరల్), ఒకేషనల్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల అనంతరం ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు హాజరుకానివ్వబోమని అధికారులు ప్రకటించిన నేపథ్యంలో ఆయా కళాశాలల సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించడంతో ఆత్మకూరు పట్టణంలోని 4 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు 9 గంటల్లోపే పరీక్షలకు హాజరు కావడం విశేషం. సీఐ ఎం నాగేశ్వరరావు, ఎస్సై ఎం.శివశంకర్‌రావు ఆధ్వర్యంలో కళాశాల రహదారితో పాటు సోమశిల సెంటర్, బీఎస్సార్ సెంటర్, దర్గా సెంటర్ వద్ద ట్రాఫిక్‌ను పోలీసులు నియంత్రించడంతో సకాలంలో పరీక్షకు హాజరయ్యేందుకు విద్యార్థులకు వెసులుబాటు కలిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 235 మంది విద్యార్థులకు 12 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల సెంటర్‌లో 244కు 233 మంది హాజరయ్యారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 245 మందికి ఐదుగురు గైర్హాజరయ్యారు. షిరిడీ సాయిరాం కళాశాల పరీక్ష కేంద్రంలో 281 మందికి 11 మంది గైర్హాజరయ్యారని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వాసుబాబు వివరించారు.

తొలి రోజు 12 మంది గైర్హాజరు

మర్రిపాడు: మర్రిపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు 185 మంది విద్యార్థులకు 173 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రం సమీపంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎస్సై విశ్వనాథ్‌రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రశాంతంగా తొలిరోజు పరీక్ష

సంగం: సంగంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకుని తమకు కేటాయించిన రూములను చూసుకుని వెళ్లారు. సంగం సీఐ రవి నాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఈ పరీక్ష కేంద్రంలో 213 మంది విద్యార్థులకు గాను 206 మంది హాజరయ్యారు.

ప్రశాంతంగా ప్రారంభం

చేజర్ల: చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొత్తం 60 మంది విద్యార్థులకు 59 మంది హాజరైనట్లు చీఫ్ ఎగ్జామినర్ టి శ్రీధర్ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని సిటింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ సుధాకర్, మోహన్‌రావు తనిఖీ చేశారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ పరీక్ష కేంద్రంలో 299 మంది విద్యార్థులకు 23 మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ డిపార్ట్‌మెంటల్, ప్రత్యేకాధికారి కిరణ్ తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించారు. సీఐ గిరిబాబు, ఎస్సై ప్రభాకర్ పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

29 మంది గైర్హాజరు

వింజమూరు: వింజమూరులో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో బుధవారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షకు తొలి రోజు 29 మంది గైర్హాజరయ్యారు. వికాస్ జూనియర్ కళాశాలలో 256 మందికి గాను 251 మంది, వివేకానంద జూనియర్ కళాశాలలో 265 మందికి 262 మంది, వైఆర్ జూనియర్ కళాశాలలో 276 మందికి 254 మంది పరీక్షకు హాజరయ్యారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

కొండాపురం: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక జూనియర్ కళాశాల కేంద్రంలో 157 మంది విద్యార్థులకు 149 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ శ్రీహరి తెలిపారు. 8 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయని, ఈ పరీక్షకు 170 మంది హాజరు కానున్నట్లు తెలిపారు.

బాబోయ్ కుక్కలు

- వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న శునకాలు
- పాదచారులు, వాహనచోదకుల వెంట పడుతున్న వైనం
- పట్టించుకోని నగర పంచాయతీ అధికారులు

అల్లూరు: అల్లూరు నగర పంచాయతీలో వీధుల్లో కుక్కలు విచ్చలవిడిగా ఉన్నాయి. ఎటు చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తుండడంతో అటుగా వెళ్లడానికి భయాందోళన చెందుతున్నారు. అక్కడక్కడ పెద్దలతో పాటు చిన్నారులు కుక్క గాట్ల పాలవుతున్నారు. రోడ్లపై వెళ్లే పాదచారులు, వాహనచోదకులను వెంబడిస్తున్నాయి. దీంతో ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానిక మసీద్ సెంటర్‌లోని చికెన్, మటన్ దుకాణాల వద్ద పడేసిన వ్యర్థాలను తింటున్న కుక్కలు మనుషులను చూస్తే క్రూరంగా వెంటపడుతున్నాయి. వేకువనే వాకింగ్‌కు వెళ్లాలంటే కుక్కల భయంతో చాలా మంది బయటకు రావడానికి భయపడుతున్నారు. ఇక రాత్రి వేళల్లో అయితే ఒంటరిగా వెళ్లే వాహనచోదకుల వెంట గుంపులు గుంపులుగా పడడంతో భయంతో వణికిపోతున్నారు. కొందరు యువకులు కర్రలు చేతపట్టి వీధుల వెంట తిరుగుతూ వాటిని బెదరగొడుతున్నారు. వీధి కుక్కలను నియంత్రించడంపై నగర పంచాయతీ అధికారులు శ్రద్ధ వహించకపోవడంతో పట్టణ ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.


స్థానిక మసీద్ సెంటర్‌లో గుంపులు గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

తరిమినా పోవడం లేదు



వీధిలో వెళ్తున్నప్పుడు కుక్కలు వెంట పడుతున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ జనాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. తరిమినా పోవడం లేదు. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే బయపడాల్సిన పరిస్థితి నెలకొంది. నగర పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– షేక్ సాబీర్, మసీద్ సెంటర్, అల్లూరు